# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 179. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.01.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## రూ.25 లక్షల రివార్డు ఉన్న మహిళా మావోయిస్టు మృతి

రాయ్ పూర్ :అమృత్ తెలంగాణ: సోమవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. రిజర్వ్ గార్డ్ ఆధ్వర్యంలోని భద్రతా దళాల బృందం దంతెవాడ జిల్లాలో బీజాపూర్ సరిహద్దు గ్రామాలైన నెల్గోడ, అకేలి, బెల్నార్‌లోని భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. మావోయిస్టులకు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో రేణుక అలియాస్ బాను అనే మహిళా మావోయిస్టు మృతి చెందారు. ఆమె రూ.25 లక్షల రివార్డు ఉన్న దండకారణ్య స్పెషల్ కమిటీకి చెందిన వారిగా భద్రతా దళాలు గుర్తించాయి. ఘటనాస్థలి నుంచి మహిళా మావోయిస్టు మృతదేహంతోపాటు ఇన్సాస్ రైఫిల్, మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది.

## ఢిల్లీలో రూ.27.4 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: మాదకద్రవ్యాల నియంత్రణా విభాగం, ఢిల్లీ పోలీసులు కలిసి పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. ఈ రెండు విభాగాలకు చెందిన సంయుక్త బృందం రూ.27.4 కోట్ల విలువైన మత్తుపదార్థాలను పట్టుకుందని, ఇందుకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేసిందని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యాపారంపై ప్రభుత్వ పోరాటంకొనసాగుతుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, వాటి రవాణా, సరఫరా విషయంలో సంయమనం పాటించరాదన్న మోడీ ప్రభుత్వ వైఖరికి అనుగుణంగా ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలో పెద్ద నార్కో నెట్‌వర్క్‌ను ఛేదించామని వివరించారని పేర్కొంటూ మంత్రి ఎక్స్‌లో పోస్టు పెట్టారు.మాదక ద్రవ్యాల ముఠాను పట్టుకున్న పోలీసులు, అధికారుల బృందం వారి నుండి ఎండిఎంఎ, మెథామెఫ్తమిన్, కొకైన్‌లు స్వాధీనం చేసుకున్నారని, వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.27.4కోట్లు వుంటుందని ఆ పోస్టు పేర్కొంది.

# వేధిస్తే కఠిన చర్యలు

## సన్‌రైజర్స్, హెచ్‌సీఏ ఐపీఎల్ పాస్‌ల వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య కొనసాగుతున్న ఐపీఎల్ టికెట్ల వివాదంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచులకు అధిక టికెట్లు ఇవ్వాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు వేధిస్తున్నారని, మైదానంలో తమ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించారని సన్‌రైజర్స్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్ ఇటీవల ఈమెయిల్‌లో పేర్కొనగా.. ఆ విషయం మీడియాలో ప్రముఖంగా వచ్చింది. ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఒత్తిడి, బెదింపులకు పాల్పడినట్టు వచ్చిన వార్తలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ అంశంపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించిన సీఎం.. ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ డైరెక్టర్ జనరల్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. సన్‌రైజర్స్ ఫ్రాంఛైజీ సిబ్బందిని వేధింపులకు గురి చేస్తే వదిలిపెట్టేది లేదని, కఠినంగా శిక్షిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐపీఎల్18 సీజన్‌లో ఉప్పల్‌లో జరుగబోయే ఇతర మ్యాచులకు టికెట్ల అంశంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో హెచ్‌సీఏ సఖ్యతతో నడుచుకోవాలని, అధిక టికెట్లను హెచ్‌సీఏ సహా ఎవరూ అడిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సిట్ ఏర్పాటు చేసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ త్వరలోనే ఈ అంశంపై నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం.

అసలు వివాదం ఏంటీ? :

సన్‌రైజర్స్ హైదరాబాద్, హైదరాబాద్ క్రికెట్ అసోయేషన్ నడుమ 20 కార్పోరేట్ బాక్స్ కాంప్లిమెంటరీ టికెట్ల కోసం ఘర్షణ మొదలైంది. సౌత్ పెవిలియన్‌లోని తొలి అంతస్థులో ఎఫ్12-ఏ బాక్స్‌లో తొలి నుంచి సన్‌రైజర్స్ 50 టికెట్లను జారీ చేస్తోంది. కానీ ఆ బాక్స్ సామర్థ్యం 20 మాత్రమేనని, మరో 10 టికెట్లు అక్కడే కేటాయించినా మిగిలిన 20 టికెట్లను ఇతర బాక్స్‌ల్లో సర్దుబాటు చేయాలని హెచ్‌సీఏ కోరింది.

ఐపీఎల్ సీజన్ ఆరంభానికి ముందు జరిగిన సంయుక్త సమావేశంలో సన్‌రైజర్స్ ప్రతినిధులు ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపినా.. తొలి రెండు మ్యాచులకు 50 టికెట్లను ఆ బాక్స్‌లోనే కేటాయించారు. ఈ చర్య హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లకు ఆగ్రహం తెప్పించినట్టు తెలుస్తోంది. గురువారం లక్నో సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్‌కు ఎఫ్12-ఏ బాక్స్‌లోని 20 టికెట్లను వెనక్కి ఇచ్చిన హెచ్‌సీఏ మరో బాక్స్‌లో జారీ చేయాలని కోరింది. అందుకు సన్‌రైజర్స్ విముఖత చూపటంతో ఫస్ట్ ఫ్లోర్‌లో సూపర్‌జెయింట్స్ ఫ్రాంఛైజీ యజమాని సంజీవ్ గోయెంకాకు కేటాయించిన ఎఫ్3 కార్పోరేట్ బాక్స్‌కు హెచ్‌సీఏ తాళం వేసింది. ఈ చర్యను సీరియస్‌గా తీసుకున్న సన్‌రైజర్స్ యాజమాన్యం హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరటంతో పాటు అవసరమైతే మరో స్టేడియంలో ఆడేందుకు సిద్ధమంటూ ఘాటుగా ఈమెయిల్ అస్త్రం సంధించింది. ఇక్కడ్నుంచి సన్‌రైజర్స్, హెచ్‌సీఏ నడుమ ఈమెయిల్స్ యుద్ధం నడువగా.. పలు ఆసక్తికర విషయాలు బయటకొచ్చాయి. విజిలెన్స్ విచారణలో హెచ్‌సీఏ, సన్‌రైజర్స్




పరస్పర ఈమెయిల్స్, సంయుక్త సమావేశాల మీటింగ్ మినిట్స్ కీలకం కానున్నాయి.

ఇదే అసలు కారణమా?

3900 ఉచిత పాస్‌లతో పాటు 3900 టికెట్లను బ్లాక్ చేసి, కొనుగోలు చేసేందుకు ప్రత్యేక పేమెంట్ లింక్ క్రియేట్ చేయాలని హెచ్‌సీఏ కోరింది. అపెక్స్ కౌన్సిల్ సభ్యులతో పాటు ఇతర క్లబ్ కార్యదర్శులు వ్యక్తిగతంగా ఈ టికెట్లను కొనుగోలు చేస్తారని, అందుకు భిన్నమైన పేమెంట్ లింక్స్ పంపాలని సూచించింది. ఇందుకు సన్‌రైజర్స్ యాజమాన్యం నిరాకరించింది. పలు స్టాండ్స్‌లో 2000 టికెట్లను ఇస్తామని, అందుకు ఒకే పేమెంట్ లింక్ పంపుతామని.. హెచ్‌సీఏ అధికారిక బ్యాంక్ నుంచే కొనుగోలు చేయాలని అప్పుడే టికెట్ల అమ్మకంలో పారదర్శకత పాటించినట్టు అవుతుందని తెలిపింది. హెచ్‌సీఏ పెద్దలు ఈ అంశంలో మళ్లీ సన్‌రైజర్స్‌ను సంప్రదించలేదు. ఈ అంశంలో విభేదాల కారణంగానే ఎఫ్12-ఏ బాక్స్ కాంప్లిమెంటరీ టికెట్లు వెనక్కి ఇవ్వటం, ఎఫ్3 బాక్స్‌కు తాళం వేసేందుకు పరిస్థితులు దారితీశాయని తెలుస్తోంది.

ఇక భేటీలకు అధ్యక్షుడు దూరం

సన్‌రైజర్స్ హైదరాబాద్ తాజాగా రాసిన మరో ఈమెయిల్‌లో హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావుపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఉప్పల్ స్టేడియం ఆధునీకరణ పనులు సన్‌రైజర్స్ నిధులతో చేసినా.. సోషల్ మీడియా ప్రచారంలో అధ్యక్షుడు ఎక్కడా తమ పేరు ప్రస్తావించలేదని, స్టేడియం ఆవరణలో మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాన్ని సైతం తమ నిధులతో నిర్మించాలని కోరినట్టు సన్‌రైజర్స్ ఈమెయిల్‌లో తెలిపింది. వ్యక్తిగతంగా ఆరోపణలు రావటంతో సన్‌రైజర్స్ ప్రతినిధులతో ఇక నుంచి జరుగబోయే ఏ సమావేశంలో తను పాల్గొనబోనని జగన్‌మోహన్ రావు సహచర అపెక్స్ కౌన్సిల్ సభ్యులకు తెలిపాడు. దీంతో అపెక్స్ కౌన్సిల్‌తో సమావేశంలో సన్‌రైజర్స్ ప్రతినిధులు తమ అభిప్రాయాలు, ఇతర అంశాలను పంచుకుని విభేదాలకు ముగింపు పలకాలని హెచ్‌సీఏ తాజాగా రాసిన మరో ఈమెయిల్‌లో కోరింది.


# ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదే

## ప్రాజెక్టులో సెంట్రల్ యూనివర్సిటీ భూమి లేదు

## 21 ఏండ్ల కిత్రం కేటాయించిన భూమిని కోర్టు ద్వారా దక్కించుకున్నాం

## అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు లేదు

## హెచ్‌సీయూ భూములపై టీజీఐఐసీ వివరణ



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై యాజమాన్య హక్కు తమదేనని తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) వివరణ ఇచ్చింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చట్టపరంగా గెలవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆ భూమిపై యాజమాన్యాన్ని దక్కించుకుందని పేర్కొంది. "కంచె గచ్చిబౌలి గ్రామంలోని సర్వేనంబర్ 25లో 400 ఎకరాల భూమిని 2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధికి ఐఎంజీ అకడమీస్ భారత ప్రయివేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. వారు ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006లో ఆ కేటాయింపును రద్దు చేసి ఏపీ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చరల్ శాఖకు కేటాయించింది. దాంతో ఐఎంజీ సంస్థ 2006లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2024లో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దాంతో ఐఎంజీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. అక్కడ కూడా ఆ సంస్థకు చుక్కెదురైంది. ఆ భూమి ప్రభుత్వానిదేనని తేల్చింది. ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆ 400 ఎకరాలు కేటాయించాలని టీజీఐఐసీ 2024, జూన్ 19న ప్రతిపాదనలు సమర్పించింది. ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆ భూమి హక్కులను టీజీఐఐసీకి బదలాయిస్తూ 2024, జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి 2024, జులై 1న టీజీఐఐసీకి అప్పగించారు" అని వివరించింది. వాస్తవం ఈ విధంగా ఉంటే, కొన్ని మీడియాల్లో అటవీ భూమనీ, బఫెల్లో లేక్, పీకాక్ లేక్ ఉన్నాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది. ఉమ్మడి సరిహద్దులకు సంబంధించి సహకరించాలని టీజీఐఐసీ సైబరాబాద్ జోనల్ మేనేజర్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌కు 2024, జులై 04వ తేదీన లేఖ రాశారని తెలిపింది. వారి సమ్మతితోనే 2024, జులై 19న రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ధారించారని పేర్కొంది.

# మయన్మార్ భూకంప మృతులు 2056 మంది

మాండలే :అమృత్ తెలంగాణ: శిథిలాల నుంచి పలు మృతదేహాల వెలికితీతతో మయన్మార్ భూకంప మృతుల సంఖ్య 2056కి చేరిందని ఆ దేశ సైనిక ప్రభుత్వం ప్రకటించింది. ఇక శిథిలాల్లో చిక్కుకున్న వారు జీవించి వుండే అవకాశాలు లేవని భావిస్తోంది. ఈ ప్రమాదంలో 270మందికిపైగా గల్లంతయ్యారని, 3900 మంది వరకు గాయపడ్డారని ప్రభుత్వ ప్రతినిధి మేజర్ జనరల్ జా మిన్ మీడియాకు తెలిపారు. దేశాన్ని అతలాకుతలం చేసిన భూకంపం భారీ నష్టాన్ని కలిగించిన నేపథ్యంలో సోమవారం మయన్మార్ ప్రభుత్వం వారం రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది. ఏప్రిల్ 6వ తేదీ వరకు జాతీయ పతాకాలను అవనతం చేస్తారని జుంటా ఒక ప్రకటనలో తెలిపింది. పరిస్థితులు చాలా దయనీయంగా వున్నాయని మాండలేలోని ఒక మసీదు చీఫ్ అడ్మినిస్ట్రేటర్ వ్యాఖ్యానించారు. ఇంకా ప్రకంపనలు కొనసాగుతుండడంతో ప్రజలు వరుసగా మూడో రోజూ వీధుల్లోనే మకాం వేశారు. మరోవైపు బ్యాంకాక్‌లో మృతుల సంఖ్య 19కి పెరిగింది. మయన్మార్‌లో కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా వరకు తెగిపోవడంతో పూర్తి సమాచారం అందడం లేదని భావిస్తున్నారు. వెయ్యి పడకల ఆస్పత్రి కూలిపోవడంతో వెలుపలనే ఆస్పత్రిని ఏర్పాటు చేసి వందలాదిమంది రోగులకు చికిత్సనందిస్తున్నారు.

వచ్చే నెల రోజుల్లో అంటు వ్యాధులు చెలరేగకుండా నివారించేందుకు, ప్రాణాలను కాపాడే అత్యవసర సాయంగా తక్షణమే 80లక్షల డాలర్లు కావాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. బాధితులకు సాయమం దించేందుకు 10కోట్ల డాలర్లకుపైగా మొత్తాలను సమకూర్చుకోవాల్సి వుందని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సమాఖ్య, రెడ్ క్రీసెంట్ సొసైటీలు పిలుపిచ్చాయి.

ప్రార్ధనలు చేస్తూనే

మయన్మార్ భూకంపంలో 700మందికి పైగా ముస్లింలు మృత్యువాత పడ్డారని మయన్మార్ ముస్లిం సంస్థ సోమవారం ప్రకటించింది. రంజాన్ మాసంలో శుక్రవారం ప్రార్ధనలు చేసే సమయం కావడంతో వీరందరూ ప్రార్ధనలు చేస్తూనే భూసమాధి అయ్యారని తెలిపింది. అయితే మసీదుల్లో చనిపోయిన ఈ 700మందీ ప్రభుత్వం ప్రకటించిన 2056మంది జాబితాలో వున్నారా లేదా అనే విషయం వెంటనే తెలియరాలేదు.

దాదాపు 60 మసీదులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భూకంపం సమయంలో




పలు మసీదులు కూలిపోతున్న వీడియోలూ వైరల్ అవుతున్నాయి.

చాలావరకు మసీదులన్నీ బాగా పాతబడిన భవనాలేనని, అందువల్ల భూకంప ధాటికి తట్టుకోలేక పోయాయని ముస్లిం ఆర్గనైజేషన్ స్ప్రింగ్ రివల్యూషన్ మయన్మార్ ముస్లిం నెట్‌వర్క్‌కి చెందిన స్టీరింగ్ కమిటీ సభ్యుడు తున్ కియా చెప్పారు.

శిథిలాల నుండి సజీవంగా గర్భవతి..!

మూడు రోజుల అనంతరం సహాయక సిబ్బంది ఓ గర్భిణిని సజీవంగా శిథిలాల కింది నుంచి బయటకు తెచ్చారు. మాండలేలోని గ్రేట్‌వాల్ హెూటల్ శిథిలాల నుంచి ఆమెను బయటకు తీసినట్టు అధికారులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఆ మహిళను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు వివరించారు. ఈ నేపథ్యంలో శిథిలాల కింద చిక్కుకుపోయిన వారు సజీవంగా ఉండొచ్చనే ఆశతో అనేకమంది ఉత్త చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కాగా శిథిలాలను పూర్తిగా తొలగించడానికి కనీసం రెండు నెలల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మృతదేహాలు కంపుకొడుతున్నాయి. ఎన్నో ఇబ్బందుల మధ్య సహాయకచర్యలు కొనసాగుతున్నాయి.. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రక్షించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి..

# అణు ఒప్పందాలపై ట్రంప్ వార్నింగ్ - మిసైల్స్ తో ఇరాన్ రెడీ

## ఇరు దేశాల మధ్య అణు సంఘర్షణలు

## ఇరాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయొద్దు

## గన్‌పౌడర్ డిపోలో నిప్పురవ్వగా మారుతాం

## హెచ్చరించిన ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఖలీబాఫ్

## అమెరికా స్థావరాలను ధ్వంసం చేసేందుకు క్షిపణులు

## వివరాలు బయటపెట్టిన పలు మీడియా కథనాలు

## చెప్పినట్టు వినకుంటే బాంబు దాడులు చేస్తాం

## సీరియస్‌గా హెచ్చరించిన అమెరికా ప్రెసిడెంట్

సెంట్రల్ డెస్క్ ,అమృత్ తెలంగాణ: అణ్వాయుధాల అభివృద్ధి విషయంలో ఇరాన్-అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. అణు ఒప్పందానికి అంగీకరించకపోతే టెహ్రాన్‌లో బాంబుల వర్షం కురిపిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ ధీటుగా స్పందించింది. అమెరికా స్థావరాలపై దాడులు చేయడానికి తమ క్షిపణులు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. వైమానిక దాడులకు చిక్కకుండా భూగర్భ సౌకర్యాలలో ఉంచిన లాంఛర్లలో క్షిపణులు లోడ్ చేసి ఉంచినట్లు ది టెహ్రాన్ టైమ్స్ ప్రచురించింది. అత్యవసర పరిస్థితులు ఎదురైతే అమెరికా సంబంధిత ప్రాంతాలపై దాడులు చేసేందుకు వాటిని ఉపయోగించనున్నట్లు ఆ కథనం పేర్కొంది.

అమెరికా ఓవరాక్షన్ ఆపాలి..

మరోవైపు అమెరికా సైనిక చర్య విస్తృత సంఘర్షణకు దారితీస్తుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగర్ ఖలీబాఫ్ అన్నారు. ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తే, అది గన్‌పౌడర్ డిపోలో నిప్పురవ్వగా మారుతుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా మధ్యప్రాచ్యంలో అమెరికా స్థావరాలను ధ్వంసం చేసే సామర్థ్యం ఉన్న క్షిపణులను ఉంచిన సొరంగాలను ది ఇరాన్ అబ్జర్వర్ సంస్థ పోస్టు చేసింది.

ఒప్పుకోకుంటే టెహ్రాన్‌పై దాడులు..

అణు ఒప్పందం విషయంలో అగ్రరాజ్యం ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని తిరస్కరించినట్లు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తెలిపారు. ఈ విషయంలో ప్రత్యక్షంగా కాకుండా, పరోక్ష మార్గంలో చర్చలు జరిపేందుకు సిద్ధమని చెప్పారు. దీనిపై స్పందించిన ట్రంప్, అణుఒప్పందానికి అంగీకరించకుంటే టెహ్రాన్‌పై కఠిన ఆంక్షలు సహా సైనిక చర్య




తీసుకునేందుకు ఉపేక్షించబోమని వ్యాఖ్యానించారు. దీనిపై ట్రంప్ ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ టెహ్రాన్‌పై బెదిరింపులకు దిగారు. ఒకవేళ అణుఒప్పందం కుదుర్చుకునేందుకు టెహ్రాన్ నిరాకరిస్తే బాంబు దాడులు తప్పవని తెలిపారు. ఆ దేశంపై మునుపెన్నడూ ఎరుగని రీతిలో ఇవి జరుగుతాయయని హెచ్చరించారు. టెహ్రాన్‌పై కఠిన ఆంక్షలు తీసుకునేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అయితే, ఇరాన్‌తో పరోక్ష చర్చలకు అంగీకరిస్తారా? లేదా అనేదానిపై మాత్రం ట్రంప్ స్పష్టతనివ్వలేదు.

పరోక్ష చర్చలు విఫలం..

లకాగా, ట్రంప్ మొదటి హయాంలో ఇరాన్‌తో సంబంధాలు అంతంత మాత్రంగానే సాగాయి. ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగింది. టెహ్రాన్‌పై ఆంక్షలు విధించింది. అప్పటినుంచి అనేక ఏళ్లుగా పరోక్ష చర్చలు విఫలమయ్యాయి. ఈ క్రమంలోనే మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ఇటీవల సంసిద్ధత వ్యక్తం చేశారు.

# పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లును అడ్డుకుంటాం: అఖిలేష్ యాదవ్

హైదారాబాద్: అమృత్ తెలంగాణ: వక్ఫ్ బిల్లుకు కేంద్రం ప్రతిపాదించిన సవరణలపై వ్యతిరేకత రోజురోజుకు పెరిగిపోతుంది. ఇప్పటికే దేశంలోని పలు రాజకీయా పార్టీలు బహిరంగానే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే ఈ వక్ఫ్ బిల్లును ఖచ్చితంగా అడ్డుకుంటామని ఆయా పార్టీల అధినేతలు కేంద్రాన్ని ముందుగానే హెచ్చరిస్తున్నారు. తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణ ఆయా రాష్ట్రాల అసెంబ్లీలో వక్ఫ్ బిల్లుకు కేంద్రం ప్రతిపాదించిన సవరణలను వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశాయి. తాజాగా సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా వక్ఫ్ బిల్లు సవరణలను వ్యతిరేకించారు. అన్ని పార్టీల బాటలోనే తమ పార్టీ నడుస్తుందని స్పష్టం చేశారు. మోజార్టీ పార్టీల నిర్ణయం ప్రకారమే..పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లును అడ్డుకుంటామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాని వృద్ధిలో చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.



# ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఈద్గా మైదానం వద్ద సామూహిక రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు నిర్వహించి నేడు "ఈద్ – ఉల్ – ఫితర్" జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, మనుషులంతా ఒక్కటే అనే భావనతో సోదరభావం, సమానత్వం, సమైక్యతా స్ఫూర్తిని నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్ర శేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, %వఞ% కౌన్సిలర్ ముబారక్,మావల మండల మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, నలిమేల నవీన్ రెడ్డి, వెంకటేష్, కొరటి ప్రభాకర్, రెండ్ల రాజన్న, గౌతమ్,ఎండీ ఇర్ఫాన్, ఎండీ ఆఫ్సార్, రహీమ్, సమీ ఉల్లా ఖాన్, ఫెరోజ్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్ఓ బృందానికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా సి ఆర్ ఓ అధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్




రంజాన్ పండుగ సందర్భంగా సేమియా సభ్యులకు ఇస్తున్న జిల్లా అధ్యక్షులు షేక్ ఇర్ఫాన్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ . సిఆర్ ఒ బృందం రంజాన్ పండుగను జరుపుకుంటుంది నేను నా సిఆర్ ఒ కుటుంబ సభ్యులను షీర్ కుర్మా పార్టీలో చేరమని ఆహ్వానిస్తున్నాను మరియు ఈద్ –ఉల్–ఫితర్ జిల్లా కార్యాలయం ఆదిలాబాద్ జిల్లా సెంటర్లో వేడుకలను ఆస్వాదించండి. జిల్లా అధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. కిరణ్ కుమార్ మహిళా విభాగం అధ్యక్షురాలు తన్నీరు హేమావతి. ప్రధాన కార్యదర్శి: బి.శ్రవణ్ యూసుఫ్ పరీక్.వర్కింగ్ ప్రెసిడెంట్:జి.శివ.మహారాజ్. ఉపాధ్యక్షులు :ఎం.శ్రీకర్.మల్లేష్.వెంకటేష్.మాధవ్ మరియు టీమ్ సభ్యులు

# అనుమతులు లేకుండా కళ్ళు కాంపౌండ్స్ నిర్వహించే వారిపై కేసులు నమోదు – రూరల్ సీఐ కే ఫణిధర్.

## పలు కళ్ళు కాంపౌండ్స్ పై రైడ్
## మావల, ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ల నందు రెండు కేసులు నమోదు.
## వీటితోపాటు నాలుగు కేసులు ఎక్సైజ్ శాఖకు అందజేత.
## విడీసీలు ప్రభుత్వ అనుమతులు లేకుండా కళ్ళు కాంపౌండ్స్ నిర్వహిస్తే కేసులు నమోదు.
## అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక దృష్టి, చర్యలు.





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ప్రభుత్వ అనుమతులు లేకుండా కళ్ళు కాంపౌండ్స్ నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఈరోజు రూరల్ సర్కిల్ పరిధిలో మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టి సావర్గం నందు కల్లు కాంపౌండ్ నిర్వహిస్తున్న నాగరాజుగౌడ్ అనే వ్యక్తిపై మావల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగిందని, అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో యాపలగూడ గ్రామం నందు విడిసి కి డబ్బులు చెల్లించి ప్రభుత్వ అనుమతి లేకుండా లైసెన్స్ లేకుండా కళ్ళు కాంపౌండ్ నిర్వహిస్తున్న దినేష్ గౌడ్ మరియు యాపిల్ కూడా వీడీసీపై కేసు నమోదు చేయడం జరిగిందని రూరల్ సీఐ కె ఫణిందర్ తెలిపారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తంతోలి గ్రామం బంగారిగూడ గ్రామం బృందావన్ కాలనీ చిట్యాల బోరి గ్రామం నందు అక్రమంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కళ్ళు కాంపౌండ్లపై నాలుగు ఎక్సైజ్ కేసులు నమోదు చేసి ఎక్సైజ్ శాఖకు అందజేయడం జరిగిందని తెలిపారు. అనుమతులు లేకుండా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి కళ్ళు కాంపౌండ్లు నిర్వహించినా, అలాంటి అసాంఘిక కార్యకలాపాలు VDC వాళ్ళు నిర్వహించినా, VDC వారిపై కూడా కఠిన చర్యలు పోలీసు శాఖ కేసులు నమోదు చేయబడతాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ తో పాటు సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఎస్సై ముజాహిద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోకకళ్యాణార్థం శబరిమాత పాదయాత్ర భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : శ్రీరామనవమి పురస్కరించుకొని బాలయ్య మహారాజ్, దేవన్న మహారాజ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుండి వివిధ మండలా గ్రామాలకు చెందిన శబరిమాత భక్తులు నిర్వహించే పాదయాత్రలో లోక కళ్యాణార్థం భక్తులు కాలినడకన కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి గ్రామంలో వెలసిన శబరిమాత ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారి ఆశిస్సులు పొందుతారు.పాదయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాదయాత్ర చేసే భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసారు.దాదాపు ఈ పాదయాత్ర ఆదిలాబాదు నుండి 100 మందితో ప్రారంభమై తాడ్వాయి వరకు 500 మంది భక్తుల వరకు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మికత, సేవా భావం పెంపొందించుకోవడం ఎంతైనా అవసరం అని పేర్కొన్నారు. భక్తుల నిబద్ధత, శ్రద్ధను ప్రశంసిస్తూ, అభ్యుదయమైన సమాజ నిర్మాణానికి ఇలాంటి పాదయాత్రలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, శబరిమాత జిల్లా కమిటి అధ్యక్షులు లింగారెడ్డి,కోశాధికారి మల్లేష్ పట్టణ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ గండ్రత్ , మావలమండలం కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, నలిమెల నవీన్ రెడ్డి,మాజీ ఎంపిపి గోవర్ధన్ రెడ్డి,ప్రభకర్, అంజిబాబు,లస్మన్న,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు శ్రీకాంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మావల మండల్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ వేముల నాగరాజు, మావల మండల్ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, నలిమేలా నవీన్ రెడ్డి, రెండ్ల రాజన్న, వెంకటేష్, లాస్మన్న, గౌతమ్, గంద్రత్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# రికార్డుల నిర్వహణ, నవీకరణ సక్రమంగా నిర్వహించాలి – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.

## గ్రామ గ్రామాన సందర్శించి పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలి.
## విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పున: ప్రారంభించాలి.
## ఎవరికి కేటాయించిన విధులను వారు క్రమశిక్షణతో నిర్వహించాలి.
## ప్రతిరోజు బ్లూ కోర్ట్, డైల్ 100 విధులను పరిశీలించాలి.
## కోర్టుల నందు నేరస్తులకు శిక్షలు పడేవిధంగా చార్జిషీట్ దాఖలు చేయాలి.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : సోమవారం జైనథ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ నందు రికార్డుల నిర్వహణ, నవీకరణ ప్రతిరోజు సరైన సమయంలో నిర్వహిస్తూ ఉండాలి అని తెలిపారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ కేటాయించి పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను విపియో ద్వారా పరిష్కరించే దిశగా వ్యవస్థను నిర్మించాలి అని తెలిపారు. ప్రతి గ్రామీణ సాయంత్రం సమయాలలో సిఐ స్థాయి ఎస్ఐ స్థాయి అధికారులు సందర్శిస్తూ గ్రామంలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తూ పరిష్కరించే దిశగా పోలీసు మీకోసం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలి. సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా ధైర్యంగా స్థిరపాలని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వీలైనంత వరకు అన్ని పోలీసు కార్యాలయాలలో సిబ్బందికి వారాంతపు సెలవు పద్ధతిని అమలు చేసే విధంగా సిబ్బంది విధులను కేటాయించాలి. మండలంలో ఉన్న రౌడీ లపై సరైన రౌడీ షీట్లు ఏర్పాటుచేసి ప్రతిరోజు పర్యవేక్షించాలి అని తెలిపారు. గంజాయి పూర్తిగా నిర్మూలించే వరకు సమాచార వ్యవస్థను మరింత పటిష్టంగా మెరుగుపరచుకొని మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. బ్లూ కోర్ట్, 100 డైల్ ప్రతిరోజు పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తూ ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలైన నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ సరైన క్రమశిక్షణ, జవాబు దారితనం,అలవర్చుకోని, అవలంబించాలని నీతి నిజాయితీలతో విధులను నిర్వర్తించాలని సూచించారు. కోర్టు డ్యూటీ అధికారి ఎప్పటికప్పుడు కోర్టుల నందు నిందితులకు నేరస్తులకు శిక్షలు పడేవిధంగా సాక్షులను సరైన సమయంలో కోర్టుల నందు హాజరు పరిచేలా చూసుకోవాలన్నారు. సిబ్బంది విధులు సీఐ మరియు ఎస్ఐ స్థాయి అధికారులకు మంచి పేరును వచ్చే విధంగా ఉండాలన్నారు. స్టేషన్ రిసెప్షన్ నందు ఎక్కువ ఫిర్యాదులు వచ్చే విధంగా సిబ్బంది ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సి ఐ డి సాయినాథ్, ఎస్సై వి పురుషోత్తం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి జరిగే అంబేద్కర్ జయంతి సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కు ఆహ్వాన అదిలాబాద్ మాల సంఘం వినతి



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎప్రిల్ 14న ఇంద్రవెల్లి లో నిర్వహించే డా బాబా సాహెబ్ జయంతి వేడుక కార్యక్రమ ప్రతులను ఆవిష్కరించిన చెన్నూరు ఎమ్మెల్యే శ్రీ వివేక్ వెంకటస్వామి ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీ కొప్పుల రమేష్ గౌరవాధ్యక్షులు శ్రీ మేకల మల్లన్న వ్యవస్థాపక అధ్యక్షులు బేర దేవన్న, అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర మంచిర్యాల జిల్లా అధ్యక్షులు తొగరి సుధాకర్ రాష్ట్ర నాయకులు కూన రవికుమార్ ఇంద్రవెల్లి జయంతి నిర్వహణ అధ్యక్షులు మనోహర్ కామ్లే ప్రధాన కార్యదర్శి కామరాజ్ వాగ్మారే తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్ళు నాటి సమస్యకు పరిష్కారం









అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ప్రజా సేవ చేయాలనే తపన,చేయించాలనే ఉత్సాహం ఉండాలే ఎలాంటి పని అయినా చిటికెలో జరిగిపోతుంది. మండల పరిధిలోని అచ్యుతాపురం ఏజెన్సీ పంచాయితి లో తట్టు కోళ్ళ నాగేశ్వరరావు ఇంటి నుండి పెద్ద నూతి చలక మీదుగా వేజల్ల మురళి ఇంటి వరకు ఏళ్ళ తరబడి అపరిష్కృతంగా ఉన్న అంతర్గత వీధి సమస్యకు ఎట్టకేలకు మోక్షం కలిగింది.దాదాపు 60 ఏండ్లు ఉనికి గల ఈ పెద్ద నూతి చలక వీధికి ఎన్నో ఏండ్లుగా పంచాయితీ రోడ్ గా తీర్చిదిద్దాలని గత కాలం పాలక వర్గాలు ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు.గత అయిదేళ్ల పంచాయితీ సర్పంచ్ గా ఉన్న నాగలక్ష్మి భర్త కొల్లు చంద్రం గతంలో ఎమ్మెల్యే లకు,నేడున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కు గ్రామం తరుపున ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రం అందజేసారు. ప్రస్తుతం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందించడంతో ఏండ్లు నాటి అంతర్గత దారి సమస్య పరిష్కారానికి నోచుకుంది. 120 మీటర్లు మేర గ్రామీణ ఉపాధి హామీ నిధులను కేటాయించి, రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్ ను నిర్మించనున్నారు. ఈ మేరకు సోమవారం ఆ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వీధిని సిద్ధం చేస్తున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అచ్యుతాపురం శాఖ అధ్యక్షులు కొల్లు చంద్రశేఖర్,సీనియర్ నాయకులు జూపల్లి వెంకటేశ్వరావు,కొనకళ్ళ చెన్నారావు యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు నాగేంద్ర, తట్టుకోల్ల సతీష్,కొనకళ్ళ శేఖర్,వంశీ,కామేష్, కిషోర్,రంగారావు,యూత్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ గడువు ఏప్రిల్ 14 వరకు పొడగింపు జిల్లా పాలనాధికారి రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఈబిసీ బీడబ్ల్యూఎస్ కు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకొని ప్రజాపాలన సేవా కేంద్రం మండల పరిషత్ కార్యాలయం లో మున్సిపల్ కార్యాలయం లో అందచేయాలని , మీ సేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకొనేవారు అదనపు చార్జీలు చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఈ నెల 14 వరకు పొడిగించారని, ఆసక్తి గల వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాలనాధికారి తెలిపారు ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకం పై రాష్ట్ర డిప్యూటీ సిఎం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి, నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో అవకాశాలు కల్పించడం జరుగుతుందని అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆన్నారు. సోమవారం సాయంత్రం ప్రజా భవన్ నుంచి ఆయన చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ యువత వారి కాళ్ల పై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి పదివేల కోట్లు ఖర్చు చేస్తుందని, అధికారులు ఈ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ ని వివరించారు. ముఖ్యమంత్రి , తాను ఈ పథకం ప్రగతిపై నిరంతరం సమీక్షిస్తామని అన్నారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచడం జరిగిందనీ, జూన్ 2 న అర్హులకు మంజూరు పత్రాలు అందజేయాలని , జూన్ 2 నుంచి 9 వరకు ప్రతి రోజు ఒక మండలం చొప్పున నియోజకవర్గం అంతటా శాంక్షన్ లెటర్లు అందజేయాలని తెలిపారు. జూన్ 9 తర్వాత శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాలని, 50 వేల వరకు లబ్ధి పొందిన వారికి వారం రోజులపాటు, 50 వేల నుంచి రెండు లక్షల వరకు లబ్ధి పొందిన వారికి 15 రోజులపాటు, 2 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన వారికి వెంటనే గ్రౌండింగ్ చేసి నగదు అందజేయాలని కోరారు. జూలై మొదటి వారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రూండింగ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి జిల్లాలో ఒక అధికారిని నియమించాలని పేర్కొన్నారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, కమిషనర్ CVN రాజు, ఈడి SC కార్పొరేషన్ మనోహర్,BC కార్పొరేషన్ ఈడి రాజా లింగు EDM రవి పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.


# సర్వమానవ సమానత్వానికి ప్రతీక రంజాన్



రాయపోల్ :అమృత్ తెలంగాణ:సామరస్యానికి సహృద్భావానికి సర్వ మానవ సమానత్వానికి కరుణ దాతృత్వానికి ప్రతీక పవిత్ర రంజాన్ పండుగ అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ నివాసానికి వెళ్లి రంజాన్ పర్వదినం సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో రంజాన్ ఒకటి అని కొనియాడారు. చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు. ఈ పవిత్రమాసం దీక్షలు , ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని వారు పేర్కొన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని అన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ రంజాన్ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని పేర్కొన్నారు. కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణ వారిదిన్నారు. ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని వారు ఆకాంక్షించారు. అలాగే మహమ్మద్ సుల్తాన ఉమర్ దంపతులు ఎస్ఆర్ ఫౌండేషన్ తరపునా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఇలాంటి సామాజిక సేవలు ఆ అల్లా హ్ దయవల్ల మరిన్ని చేయాలని ఆ దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీపై ఉండాలని కోరుకున్నారు. అనంతరం సుల్తాన ఉమర్ దంపతులు ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య లను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్, బీఆర్ఎస్ నాయకులు ఇప్ప దయాకర్,నర్రరాజేందర్,అఫ్జలుద్దీన్,నందు, గణేష్ పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకంపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకై ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 14, 2025 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. 50 వేల రూపాయల లోపు రుణం వంద శాతం మాఫీ, లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం మాఫీ, లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు 80 శాతం రాయితీ. 2లక్షల రూపాయల నుంచి రూ. 4 లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుంది. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు లోన్ల ద్వారా అందిస్తారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల లోపు ఉండాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 2 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలన్నింటినీ మున్సిపల్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, రాజీవ్ యు వికాసం పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు పత్రిక ప్రకటనలు ఇచ్చామన్నారు. గ్రామీణ స్థాయిలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఎక్కువమంది దరఖాస్తులు చేసుకునే విధంగా యువతను ప్రోత్సహించే విధంగా అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలిపారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మైనార్టీ అధికారి మోహన్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ఘనంగా పవిత్ర రంజాన్ వేడుకలు



రాయపోల్ :అమృత్ తెలంగాణ: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని ముస్లిం సోదరులు అంగరంగ వైభవంగా రాయపోల్ మండల పరిధిలోని పలు గ్రామాలలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంజాన్ పండుగ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు మజీద్ లు, ఈద్గా మైదానంలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సేవతాత్పరకు,మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుంది. సోమవారం రాయపోల్ మండలంలోని మంతూరు, రాంసాగర్, సయ్యద్ నగర్, రాయపోల్ తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను సంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు పిల్లలు, పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భారత దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్ కోరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో రంజాన్. చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్. ఈ పవిత్ర మాసం దీక్షలు , ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుంది. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ముస్లింలు ప్రార్థిస్తారు. కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణది. ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని వారు ఆకాంక్షిస్తారు.

# ఢిల్లీలో స్కోచ్ అవార్డు అందుకున్న ఆదిలాబాద్ కలెక్టర్




ఆదిలాబాద్ : అమృత్ తెలంగాణ:జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇటీవల స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా శనివారం ఢిల్లీలో పద్మ శ్రీ డా. దీపక్, బీ పాతక్, డా. గుర్షరన్, దంజల్, వైస్ చైర్మన్ స్కోచ్ గ్రూప్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కలెక్టర్ రాజర్షి షా రూపకల్పనలో శ్రీకారం చుట్టి రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా ఆరోగ్య పాఠశాలను బాలల దినోత్సవం రోజు ప్రారంభించారు. ఈ ఆరు సూత్రాల పై విద్యార్థులకు అవగాహన కల్పించి, విద్యార్థుల జీవన శైలిలో ఎన్నో మార్పులను తెచ్చిన ఈ కార్యక్రమం జిల్లాలో ఎంతో విజయవంతంగా కొనసాగుతోంది. కలెక్టర్ నేతృత్వంలో శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమం జిల్లాల్లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసేందుకు, విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడం కోసం రూపొందించిన కార్యక్రమమే ఈ ఆరోగ్య పాఠశాల. నవంబర్ 14వ తేదీ నుండి అన్ని ఉన్నత పాఠశాలల్లో, కేజిబివి, ఇంటర్ కళాశాలల్లో ప్రారంభించారు. ఒక్కో వారం ఒక్కో అంశాన్ని అమలు చేస్తూ 4 వారాల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ప్రతి సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత..

ప్రతి మంగళవారం పోషకాహారంపై అవగాహన..

ప్రతి బుధవారం ఒత్తిడి నివారించుకునే మార్గాలు..

ప్రతి గురువారం డ్రగ్స్ కు దూరంగా ఉండడం గురించి..

ప్రతి శుక్రవారం కాలానుగత వ్యాధుల నివారణ గురించి ..

ప్రతి శనివారం వ్యక్తిత్వ వికాసం

ఇలా ఆరు సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవాలని రేపటి భావిభారత పౌరులు మీరేనని, చెడు వ్యసనాలకు దూరంగా, మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, చదువులో రానిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకొని ఆదర్శవంతంగా నిలవాలని ఏర్పాటు చేసిన ఈ వినూత్న కార్యక్రమం విద్యార్థుల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఇటీవల స్కోచ్ అవార్డుకు ఎంపిక కావడంతో అవార్డు అందుకున్నారు. కలెక్టర్ అవార్డు అందుకున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదిక ద్వారా జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు.

# కష్టకాలంలో అండగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనం



రాయపోల్ :అమృత్ తెలంగాణ: స్నేహితులంటే కలిసి తిరగడం చదువుకోవడమే కాదు స్నేహితులు, స్నేహితుల కుటుంబాలు కష్టాలలో ఉన్నప్పుడు వేమున్నామంటూ చేయూతనివ్వడమే నిజమైన స్నేహానికి నిదర్శనం. రాయపోల్ పదవ తరగతి 2009- 2010 బ్యాచ్ కి చెందిన స్నేహితులలో ఒకరైన రాయపోల్ గ్రామానికి చెందిన బొడ్డు భాస్కర్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. సోమవారం వారి కుటుంబ సభ్యులను స్నేహితులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతోపాటు కలిసి చదువుకున్న బొడ్డు భాస్కర్ గతంలోనే రోడ్డు ప్రమాదంలో తన కాలుని కోల్పోయి వికలాంగుడిగా మారాడు. అంతలోనే ఇటీవల గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని, మా స్నేహితుడు భాస్కర్ లేని లోటు తీర్చలేనిది, కానీ మా స్నేహానికి గుర్తుగా వారి కుటుంబానికి భరోసాను కల్పించడానికి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. భాస్కర్ కు భార్య లావణ్య ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిది అసలే నిరుపేద కుటుంబం తండ్రి లేని పిల్లలతో బ్రతుకు పోరాటం సాగించడం లావణ్య తలకు మించిన భారంగా మారింది. వారికి ఇక ముందు కూడా చేదోడు వాదోడుగా ఉంటామని మనోధైర్యం కల్పించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో రాయపోల్ 2009-2010 బ్యాచ్ స్నేహితులు బ్యాగరి స్వామీ,కొంగరి శ్రీనివాస్, తుడుం ఇంద్ర కరణ్,చంద్రశేఖర్ రెడ్డి,ప్రభాకర్,ప్రవీణ్,ఎల్లం, మల్లేశం,దయ్యాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కి ముఖ్యమంత్రి ఉగాది పురస్కారం అందజేత

అమరావతి అమృత్ తెలంగాణ: అఖిల భారత పం చాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు మరియు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రతిష్టాత్మకమైన ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. గత కొన్నేళ్లుగా జాస్తి చేస్తున్న సామాజిక సేవను గుర్తించి ఏపీ ప్రభుత్వం ఆయనను సన్మానించి కృష్ణవేణి తల్లి షీల్డును బహుకరించింది. గతంలో 2017 వ సంవత్సరంలో కూడా ఉగాది పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ శ్రమశక్తి అవార్డు, ముఖ్యమంత్రి నుంచి అందుకున్నారు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, ఆనం రామనారాయణ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్,ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఏవి రాజమౌళి ఎమ్మెల్యేలు, చైర్మన్లు ఉన్నారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శ్రీ విశ్వా వసు ఉగాది పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు నూతన తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపి శ్రీ వెంకటేశ్వర స్వామి షీల్డ్ ని బహూకరించారు పల్నాడు జిల్లా అమరావతి మండల పరిధిలోని పెద మద్దూరు గ్రామానికి చెందిన డాక్టర్ జాస్తి వీరాంజనేయులుకు ఉగాది పర్వదినం నాడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ప్రతిష్టాత్మకమైన ఉగాది పురస్కారం లభించటంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌ తుంది. అఖిల భారత పంచాయతీ పరిషత్ (దిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులుగా, అమరావతి డెవలప్మెంట్ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుగా,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఉమ్మడి గుంటూరు బ్రాంచ్ పాట్రన్ గా సామాజిక సేవారంగంలో ఉన్నతమైన సేవలను అందిస్తూ అమరావతి ప్రాంత అభివృద్ధికి తోడ్పా టు నందిస్తూ ఇతర దేశాల్లో కూడా అమరావతి గురించి ప్రచారాన్ని నిర్వహించారు రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయిలో గ్రామపంచాయతీలు స్థానిక సంస్థల బలేపేతం అయ్యేవిధంగా స్థానిక సంస్థలకు నిధులు విధులు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపారు అనేక రాష్ట్రాల్లో పర్యటించారు సర్పంచులను చైతన్య పరిచారు దిల్లీ కి అనేక పర్యాయములు వెళ్లి ఆంధ్రప్రదేశ్ లో నూతన కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కోసం ఆ శాఖ కేంద్ర మంత్రులను కార్యదర్శులను అధికారులను వ్యక్తిగతంగా కలిసి కృషి చేశారు, రాజధాని అమరావతి లోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉండాలని కేంద్ర ప్రభుత్వంతో ప్రధాని కార్యాలయంతో లేఖల ద్వారా సంప్రదింపులు జరిపారు అనేక సాంస్కృతిక సంస్థల కార్యక్రమాలకు హాజరవుతూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు దేశ విదేశాల్లో ఉన్న అమరావతి బౌద్ధ శిల్ప సంపదను తిరిగి అమరావతికి తీసుకువచ్చే దానికోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నారు రాష్ట్రంలో ఎన్నో చారిత్రక



ప్రాంతాల అభివృద్ధి కోసం లేపాక్షి,గండికోట అమరావతి,శాలిగుండం, శంకరం, గుంటుపల్లి, నాగార్జునకొండ తదితర చారిత్రక ప్రాంతాలకు యునెస్కో గుర్తింపు కోసం ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న వీరాంజనేయులుకు ఉగాది పురస్కారంలభించటంపై పెదమద్దూరు గ్రామస్తులు, పలువు రురాజకీయనేతలు,సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు గతంలో కూడా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అవార్డులు అందుకున్నారు ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజ నేయులు మాట్లాడుతూ భవిష్యత్లో కూడా తన వంతుగా రాష్ట్ర జాతీయ స్థాయిలో సామాజిక సేవ కొనసాగిస్తానని తెలిపారు ఇంత ప్రతిష్టాత్మకమైన అవార్డుకు నేను చేసిన సేవలను గుర్తించి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అవార్డు ఎంపిక కమిటీ చైర్మన్, అవనిగడ్డ శాసనసభ్యులు రాష్ట్ర ఎథిక్స్ కమిటీ చైర్మన్ మాజీ మంత్రివర్యులు మండలి బుద్ధ ప్రసాద్, రాష్ట్ర చైర్మన్ లు పొడపాటి తేజస్విని, గుమ్మడి గోపాలకృష్ణ ఇతర కమిటీ సభ్యులకు, సీఈఓ ఆర్ మల్లికార్జున రావు కు కృతజ్ఞతలు తెలిపారు

# తిరుపతి స్మార్ట్ సిటీ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి : స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి :అమృత్ తెలంగాణ: స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న పనుల్లో పెండింగ్ ఉన్న వాటిని సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం స్మార్ట్ సిటీ ఎం.డి,, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన స్మార్ట్ సిటీ 38 వ బోర్డు మీటింగ్ నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. స్మార్ట్ సిటీ లో జరుగుతున్న అభివఅద్ధి పనులను మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్ లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇంజనీరింగ్ చీఫ్ మరియు ఇండిపెండెంట్ డైరెక్టర్లు డా.రామచంద్ర రెడ్డి, డా. రమాశ్రీ , డిల్లీ నుండి రవిచంద్ర, పాల్గొన్నారు. బోర్డు మీటింగ్ లో గత బోర్డు మీటింగ్ నిర్ణయాలు, అకౌంట్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుతున్న అభివృద్ధి పనులు పెండింగ్ ఉన్నాయని వాటిని వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఐ ట్రిపుల్ సి ద్వారా నిరంతర పర్యవేక్షణ సాగేలా చూడాలని అన్నారు. నగరంలో సి సి కెమెరాల ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు





ఉలవపాడు మార్చి 31 అమృత్ తెలంగాణ: ముస్లింలు పవిత్ర ఉపవాసాలు ముగింపు రోజే రంజాన్ పండుగ దీనిని ఈద్–ఉల్–ఫితర్ అంటారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగ ఇది ఒక రోజు జరుపుకునే పండుగ కాదు నెల రోజులు పాటు ఉపవాస దీక్షలు తర్వాత నోరు తీపి చేసుకుంటూ ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ చేసుకొనే పండుగ రంజాన్ పండుగ. ఈ పండుగను పురస్కరించుకొనిఉలవపాడు లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. మండువేసవిలో చిన్న పెద్ద తేడా లేకుండా నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు సోమవారం దీక్షలు ముగించుకున్న నేపథ్యంలో ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించారు. ముస్లిం సోదరులు తాము సంపాదించిన నగదులో కొంత భాగాన్ని రంజాన్ పండుగను పురస్కరించుకుని పేదవారికి దానం చేయడం గొప్ప విషయం. మనుషులంతా ఒక్కటేనని సన్మార్గంలో నడవాలని నీతి నిజాయితీగా బ్రతకాలని కురాన్ లో సూచించిందని వారి ప్రగాఢ నమ్మకం. దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉ ండాలని ఈద్గా వద్ద ప్రార్థనలు ప్రత్యేక నిర్వహించారు.

# సైకిల్ పై సిపిఎం జాతీయ మహాసభకు



చిత్తూరు:అమృత్ తెలంగాణ: సిపిఎం 24వ ఆల్ ఇండియా మహాసభలు ఏప్రిల్ 2 నుండి 6 వరకు చెన్నైలోని మధురైలో జరగనున్నాయి. ఆరో తేదీన భారీ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుంది. ఈ మహాసభలకు తిరుపతి నుండి మధురైకి మాజీ చిత్తూరు జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య, సభ్యుడు కుప్పస్వామి సైకిల్ యాత్ర చేపట్టారు. వారి యాత్ర చిత్తూరుకి చేరుకుంది. గాంధీ విగ్రహం వద్ద సిపిఎం బృందం వారిని స్వాగతించి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ దేశంలోని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడుతున్నదని తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలకు జరిగే మహాసభలు ఈ సంవత్సరం మదురైలో జరుగుతున్నాయి.

# బొద్దింకలతో నిండిన గదిలో జాన్వీ బంధిఖానా



బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్షణం తీరిక లేకుండా ఉంది జాన్వీ కపూర్. ఈ యంగ్ బ్యూటీ నటించిన మిలీ ఎట్టకేలకు నవంబర్ 4న పెద్ద తెరపైకి వచ్చింది. పాజిటివ్ సమీక్షలతో మిలీ బాక్సాఫీస్ వద్ద బాగానే రాణించిందని ట్రేడ్ వెల్లడించింది. మత్తుకుట్టి జేవియర్ దర్శకత్వం వహించిన ఈ సర్వైవల్-థ్రిల్లర్ లో సన్నీ కౌశల్ - మనోజ్ పహ్వా కూడా ప్రధాన పాత్రలు పోషించారు. ఇది మలయాళ భాషా చిత్రం హెలెన్ కి రీమేక్. ఈ సినిమాని జాన్వీ తండ్రి బోనీకపూర్ స్వయంగా నిర్మించడం ఆసక్తికరం. పాపా బోనీ నిర్మాతగా మొదటి సహకారం జాన్వీకి చాలా ప్రత్యేకమైనది. తన స్పెషల్ సర్వైవల్ డ్రామాను ప్రచారం చేస్తూ తాజాగా జాన్వీ చెప్పిన ఓ సంగతి యువతరంలో హాట్ టాపిగ్గా మారింది. తాను బొద్దింకలతో నిండిన గదిలో ఎందుకు బంధించబడాలనుకుంటోందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వివరించింది. ఒకవేళ బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితే లేదా మిలీ సినిమాలో లాగా ఫ్రీజర్ లో బంధించబడితే..? ఈ రెండిటిలో ఏది బెస్ట్.. మీరైతే ఏం చేస్తారు? మీ ఫీలింగ్ ఏంటీ? అంటూ హెూస్ట్ జాన్వీ కపూర్ ని సరదాగా ప్రశ్నించారు. దానికి జాన్వీ ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నేను ఫ్రీజర్ లోకి తిరిగి వెళ్లలేను. నేను బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితేనే బెటర్ అని చెప్పింది. ఫ్రీజర్లో ఉ ండటం చాలా కష్టంగా ఉందని కూడా జాన్వీ తెలిపింది. జాన్వీ కపూర్ మిలీ కథాంశం ఆసక్తికరం. ఒక ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీలో వెయిటర్ గా పనిచేసి 48 గంటలకు పైగా ఫ్రీజర్ లో బంధించబడిన ఒక అమ్మాయి కథేమిటన్నది తెరపై చూపించారు.

# మరోసారి బోల్డ్ గా ఒంపుల్ని ప్రదర్శించిన ఇషా

టాప్ మోడల్ కం నటి ఇషా గుప్తా పరిచయం అవసరం లేదు. గ్లామర్ షో విషయంలో హద్దులు చెరిపేసి చెలరేగడం ఈ సీనియర్ బ్యూటీ ప్రత్యేకత. ఇన్ స్టా వేదికగా ఇషాగుప్తా ఎప్పటికప్పుడు చెలరేగి అందాలు ఆరబోస్తుంది. తాజాగా ఇషా షేర్ చేసిన బోల్డ్ ఫోటోషూట్ అంతర్జాలంలో దుమారం రేపుతోంది. ఇషాజీ మరోసారి తనదైన శైలిలో చెలరేగారు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్ గౌలో వజ్రంలా మెరుస్తోంది. ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రాప్డ్ స్లీవ్ లో గ్లామర్ ని ఆవిష్కరించిన తీరు కుర్రకారుకు మైండ్ బ్లాక్ చేస్తోంది. మోడల్ కం నటి పర్యావరణవేత్త అయిన ఈషా గుప్తా నటిగా ఇప్పటికే బాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది. తిరుగులేని ఎనర్జీతో స్టైల్ ఐకాన్ గా వెలుగులు విరజిమ్ముతోంది. తన స్టైల్ పై రెగ్యులర్ అప్ డేట్ లతో ఈషా ఇప్పటికే 13 మిలియన్లకు పైగా ఇన్ స్టాగ్రామ్ ఫాలోవర్ల ఫాలోవర్ లను సంపాదించింది. ఈషా గుప్తా నిరంతర ఫ్యాషన్ సెన్స్ పై నేటితరంలో డిబేట్లు సాగుతుంటాయంటే అర్థం చేసుకోవాలి. తాను ఎంచుకున్నది ఎత్నిక్ వేర్ అయినా... ఆరు గజాల పవిట కొంగుతో చీరలో అయినా.. అందమైన గౌనులో అయినా తన డ్రెస్సింగ్ సెన్స్ నుంచి కళ్లు తిప్పుకోవడం అంత ఈజీ కాదు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్డ్ గౌలో ఒంపులు రంగరించిన తీరుపై చర్చా సాగుతోంది. ఇషాజీ ఫ్యాషన్ ప్రపంచపు మహారాణి. రక రకాల ఫ్యాషన్ దుస్తులకు స్టైలింగ్ చేస్తూ మోడల్ గా అదరగొడుతుంటుంది. తన ఇన్ స్టాగ్రామ్ ఫోటోలలో ప్రయోగాలతో పాటు కాలానుగుణ వస్త్రధారణలతో తన ఆసక్తిని తరచుగా ప్రదర్శిస్తుంది. తళతళా




మెరిసే దుస్తులతో ప్రతిసారీ డ్రీమ్ గాళ్ ని తలపిస్తుంది. మెరిసే గౌనులో ఈషా మరోసారి కళ్ళు తిప్పుకోనివ్వని ట్రీటిచ్చింది. ఈసారి జెన్నీ ప్యాక్ మన్ రాక్ ల నుండి ప్లాటినం గ్రే గౌనును ఎంచుకుంది. ఆమె ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రెప్డ్ స్లీవ్ తో ఆకట్టుకుంది. స్ట్రెయిట్ హెయిర్ నిగనిగల అందాలతో మెరిపించింది ఇషా. ఇషా గుప్తా టాలీవుడ్ కి సుపరిచితం. కానీ ఇక్కడ నటించేందుకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. రామ్ చరణ్ వినయ విధేయ రామాలో హాట్ ఐటమ్ నంబర్ తో కట్టి పడేసినా ఆ తర్వాత కనిపించలేదు. 'జన్నత్' సినిమాతో బాలీవుడ్ లో లాంచ్ అయింది. ఆ తర్వాత అక్కడ బాగానే అవకాశాలు వస్తున్నాయి. కాలేజ్ డేస్ నుంచి సినిమాలంటే ఆసక్తి. దీంతో ఈషా మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఎన్నో అందాల పోటీల్లో పాల్గొంది. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లోనూ నెగ్గింది. చివరిగా బాలీవుడ్ లో నటిగా స్థిరపడింది. ప్రస్తుతం ప్రపంచ సుందరి పోటీలకు ఎంపికయ్యే మోడల్స్ కి ఇషా జీ శిక్షణను అందిస్తున్నారు. ఫెమినా మిస్ ఇండియా జడ్జిగానూ ఇషా కు చాలా అనుభవం ఉంది. ఇటీవల బాబీ డియోల్ తో కలిసి 'ఆశ్రమ్ సీజన్ 2'లో ఈషా చివరిగా కనిపించింది. పలు భారీ చిత్రాలకు ఇషా గుప్తా సంతకాలు చేసింది. వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

# మల్లె చెండు ఒళ్లంతా చుట్టుకుని కలకలం రేపిన నటి

అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. కొత్తొక వింత పాతొక రోత! పాత సంవత్సరానికి భాయ్ చెప్పి కొత్త సంవత్సరానికి వెల్ కం చెప్పింది కన్నడ నటి రాగిణి ద్వివేది. ఉగాది ఫర్వదినాన్ని పురష్కరించుకుని ఇదిగో ఇలా కొత్తగా కొంగొత్తగా తనని తాను పరిచయం చేసుకుంది. గతాన్ని తలుచుకుని సమయాన్ని వృధా చేసేందుకు రాగిణి సిద్ధంగా లేదు. భవిష్యత్ గురించి మాత్రమే ఆలోచిస్తోంది. అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇదిగో ఇలా మల్లె చెండును ఒంటికి చుట్టుకుని, జెరీ అంచు బంగారు వర్ణం సిల్కు చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతోంది. అలా పానుపుపై జేరబడి, మల్లెలను ముంజేతికి కట్టుకుని సువాసన పీలుస్తూ, అసలు రాగిణి ఇచ్చిన ఫోజ్‌లు కుర్రకారులో కలకలం రేపుతున్నాయి. పానుపుపై బంతిపూల దండల మధ్య రాగిణి రసరమ్యంగా మెరిసిపోతోంది. ఒక కొత్త సంవత్సరం, ఒక కొత్త అధ్యాయం – దానిని ఆశ – దృఢ సంకల్పంతో స్వీకరించండి! ప్రతి సూర్యోదయం ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది – దీనిని అద్భుత ప్రారంభంగా చేసుకోండి!




# మళయాళ భామ 'కుమారి'గా వస్తుంది..!



మళయాళంలో తన నటతో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య లక్ష్మి ఈమధ్య తమిళ సినిమాల్లో కూడా సందడి చేస్తుంది. తెలుగులో గాడ్సే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఐశ్వర్య లక్ష్మి. రీసెంట్ గా పొన్నియిన్ సెల్వన్ 1 సినిమాతో కూడా అమ్మడు ఆకట్టుకుంది. సినిమాలో తన పోర్షన్ వరకు అదరగొట్టేసింది ఐశ్వర్య. సినిమాలే కాదు ఓటీటీ వెబ్ సీరీస్ లతో కూడా ఆడియన్స్ ని అలరిస్తుంది అమ్మడు. ఇటీవలే అమ్ము అంటూ ఓ తెలుగు వెబ్ సీరీస్ తో వచ్చిన ఐశ్వర్య లక్ష్మి ఆ సినిమాతో ప్రశంసలు అందుకుంది. ఆ మూవీ తర్వాత కొద్దిపాటి గ్యాప్ తోనే మరో మూవీతో వస్తుంది ఐశ్వర్య. ఈసారి కుమారి అంటూ ఒక మైథలాజికల్ ఫాంటసీ మూవీతో వస్తుంది. ఈ మూవీని నిర్మల్ సహదేవ్ డైరెక్ట్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా నవంబర్ 18 శుక్రవారం రిలీజ్ అవుతుంది. అమ్ము సినిమాతో ఒక ఇంప్యాక్ట్ క్రియేట్ చేసిన ఐశ్వర్య లక్ష్మి కుమారితో కూడా అలరిస్తుందని అంటున్నారు. ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ లో వస్తున్న కుమారి మూవీ టీజర్ ట్రైలర్ ఈ సీరీస్ పై ఆసక్తి కలిగించాయి. థియేటర్ లోనే వస్తేనే కాదు తమకు నచ్చిన కంటెంట్ ఎక్కడ రిలీజైనా సరే చూసేస్తున్నారు ప్రేక్షకులు. ముఖ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెరగడం.. అంత ఖర్చు పెట్టి సినిమా చూసినా నిరాశపరచడం లాంటి కారణాల వల్ల థియేటర్ లో సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపట్లేదు. అందుకే ఓటీటీలకు ఎక్కువ డిమాండ్ పెరిగింది. భాషతో సంబంధం లేకుండా ఓటీటీ లో వెరైటీ కంటెంట్ ఉంటే చాలు ప్రేక్షకులు విరగబడి చూసేస్తున్నారు. వెండితెర మీద అద్భుతాలు చేయాలని అనుకున్న ఔత్సాహిక కళాకారులకు కూడా ఈ ఓటీటీల్లో మంచి అవకాశాలు వస్తున్నాయి. అందుకే ఈమధ్య ఓటీటీల్లో మంచి మంచి కంటెంట్ సినిమాలు వస్తున్నాయి. తెలుగులోనే కాదు ఇతర భాషల సినిమాలు వెబ్ సీరీస్ లు కూడా మన ప్రేక్షకులు చూస్తున్నారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com